





ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి

పాలమూరును.. గెలిపిద్దాం



- ఇది నా ఎన్నిక కాదు.. పాలమూరు అభివృద్ధిని కోరుకునే ఎన్నిక
- సీఎం మనవారే ఉన్నారు.. అభివృద్ధి చేసే బాధ్యత కూడా మనదే..
- పార్టీలు, అజెండాలు, అభిమానాలకు అతీతంగా ప్రజలు ఓటేయాలి
- 'పేట'- కొడంగల్ లిఫ్ట్‌కు నిధులు, సంగంబండ బ్లాస్టింగ్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

మహబూబ్‌నగర్, మే 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): 'ప్రస్తుతం జరుగుతున్నది నా ఎన్నిక కాదు. పాలమూరు అభివృద్ధి కోరుకునే ఎన్నిక. జెండాలు, అజెండాలు, అభిమానాలకు అతీతంగా పాలమూరు సమగ్రాభివృద్ధికి ప్రజలంతా ఓటు వేసి, పాలమూరును గెలిపించాలి' అని అంటున్నారు కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి. పాలమూరు బిడ్డనే రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారని, ఆయన సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన కొద్ది రోజుల్లోనే.. ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి నిధులు మంజూరు చేశారని, మక్తల్, నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాల్లోని 1.30 లక్షల ఎకరాలకు నీరిచ్చేందుకు శంకుస్థాపన చేశారని చెబుతున్నారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఆ వివరాలు..

ప్రశ్న: పాలమూరు సమగ్రాభివృద్ధిపై మీ విజన్ ఏంటి?

వంశీచంద్‌రెడ్డి: పాలమూరు బిడ్డ సీఎంగా ఎన్నికయ్యారు. ఈ ప్రాంత ప్రజల కష్టాలు, బాధలు ఆయన కంటే ఎక్కువగా ఎవరూ అర్థం చేసుకోలేరు. ఈ జిల్లా పరిధిలో ప్రతీ నియోజకవర్గం అభివృద్ధి బాధ్యతను ఆయన తీసుకుంటారు. ఆయన తరఫున ప్రతినిధిగా నేను ఎంపీగా వెళ్తే.. పాలమూరుకు-ఢిల్లీకి వారధిగా ఉంటాను. ప్రధానంగా యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ఒక్కో నియోజకవర్గాన్ని ఒక్కో హబ్‌గా తీర్చిదిద్దబోతున్నాం. ఇప్పటికే పాలమూరు న్యాయయాత్రలో తెలుసుకున్న అంశాలతో ఒక ప్రణాళికను రూపొందించి ముందుకు వెళ్తాం. కేంద్రం నుంచి మనకు రావాల్సిన నిధులు వచ్చి.. పాలమూరు అభివృద్ధి కావాలంటే కాంగ్రెస్‌ను గెలిపించాలి. అప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి, నేను జోడెద్దుల్లాగా పని చేయగలుగుతాం.

ప్రశ్న: పాదయాత్ర చేశారు కదా.. ఎలాంటి సమస్యలు గుర్తించారు?

వంశీచంద్‌రెడ్డి: పాలమూరు న్యాయయాత్ర పేరుతో నేను పాదయాత్ర నిర్వహించాను. మక్తల్‌లో యాత్ర ప్రారంభించినప్పుడు, సంగంబండ కింద ఆయకట్టు ఉన్నా.. కేవలం బండ బ్లాస్టింగ్ జరగకపోవడంతో పదేళ్లుగా 20 వేల ఎకరాలకు నీరందడం లేదని రైతులు చెప్పారు. నేను వెంటనే సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి.. ఎమ్మెల్యేల సహకారంతో సంగంబండ బ్లాస్టింగ్ కోసం రూ.10 కోట్లు మంజూరు చేయించాను. ఆ పనులు ఇప్పుడు జరుగుతున్నాయి. దీంతో పాటు పాలమూరు జిల్లాలో ఎక్కువ కరువు ప్రాంతాలైన మక్తల్, నారాయణ, కొడంగల్‌కు జీవో 69 పదేళ్లుగా అమలు కాలేదు. ఈ సమస్యకు పరిష్కారంగా ఎత్తిపోతల పథకానికి రూ.నాలుగు వేల కోట్లతో గ్రీన్ సిగ్నల్ వచ్చి.. ప్రస్తుతం టెండర్ల దశలో పనులు ఉన్నాయి. రెండేళ్లలో ఆ ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు పూర్తిచేసి 1.30 లక్షల నీరం దిస్తాం.

ప్రశ్న: మీ విజయానికి ఏయే అంశాలు దోహదం చేస్తాయనుకుంటున్నారు?

వంశీచంద్‌రెడ్డి: కాంగ్రెస్ పార్టీకి కష్టపడి పనిచేసే కేడర్ ఉంది. ఆ ఫలితాలను అసెంబ్లీ ఎన్నికల్లో చూశారు. ఎమ్మెల్యేలకు వారి నియోజకవర్గాలపై పట్టు ఉంది. అందరూ గ్రౌండ్ లెవల్ నుంచి వచ్చినవారే. ప్రజల కష్టాలను సులభంగా అర్థం చేసుకుని పరిష్కారం చేస్తారు. వారితో నాకు మంచి సమన్వయం ఉంది. ఒక విజన్‌తో మేము ముందుకు వెళ్లబోతున్నాం. అదే ప్రచారంలో చెబుతున్నాం. అలాగే ప్రభుత్వం ఏర్పడిన అతి కొద్దిరోజుల్లోనే రూ.వేల కోట్లతో అభివృద్ధి పనులు చేయడం మా పనితీరుకు నిదర్శనంగా ప్రజలు భావిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలనే తపన వారిలో కనిపిస్తోంది.

ఆంధ్రజ్యోతితో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

ప్రశ్న: గ్యారెంటీలపై ప్రజల నుంచి స్పందన ఎలా వస్తోంది?

వంశీచంద్‌రెడ్డి: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పింది. ఇప్పటికే ఐదు గ్యారెంటీలు అమల్లోకి వచ్చాయి. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ వల్ల రెండు గ్యారెంటీలు పాలమూరులో అమలు కావడం లేదు. కోడ్ ముగిసిన వెంటనే ఇక్కడ కూడా అమలు చేస్తాం. ఉచిత బస్సు ప్రయాణంపై మహిళల నుంచి మంచి స్పందన వస్తోంది. రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంచడం వల్ల ఎంతోమంది నిరుపేదలు లబ్ధి పొందుతున్నారు. పంద్రాగస్టులోగా రూ. రెండు లక్షల రుణమాఫీని అమలు చేయబోతున్నాం. రైతు భరోసా కింద పంట సాయం ఇప్పటికే రైతులకు అందింది. వీటిపై ప్రజల నుంచి విశేష స్పందన ఉంది. భవిష్యత్‌లో రాహుల్ గాంధీ ప్రకటించిన ఐదు గ్యారెంటీలు కూడా అమలు చేయబోతున్నాం.

ఎన్నికల ప్రచారానికి అధినేతలు

- నేడు నారాయణపేటకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ..
- మక్తల్, షాద్‌నగర్‌లకు సీఎం రేవంత్‌రెడ్డి
- రేపు వనపర్తి బహిరంగ సభకు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా
- పోలింగ్ తేదీ దగ్గర పడటంతో పార్టీల ప్రచార హోరు



ప్రధాని మోదీ సభ కోసం నారాయణపేటలో చేస్తున్న ఏర్పాట్లు

మహబూబ్‌నగర్, మే 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల ప్రచారం చివరి అంకానికి చేరుకుంటోంది. ఈ నెల 11 తేదీతో ప్రచారం నిలిచిపోనుండటంతో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రచారాన్ని ఉధృతం చేశాయి. అందులో భాగంగా శుక్రవారం నారాయణపేటలో బీజేపీ అభ్యర్థి డీకే అరుణకు మద్దతుగా నిర్వహించే సభకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హాజరుకానున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా మక్తల్, షాద్‌నగర్‌లలో నిర్వహించే కార్నర్ మీటింగ్‌లలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. బీజేపీ ఆధ్వర్యంలో శనివారం వనపర్తిలో నిర్వహించే సభకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా రానున్నారు. బీజేపీ తరఫున ప్రచారానికి ఇప్పటికే ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ దామీ, పార్టీ సంఘటన ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, రాజాసింగ్, వెంకటరమణారెడ్డి, నవనీత్‌కౌర్‌లాంటి ముఖ్య నాయకులు హాజరుకాగా.. మోదీ పర్యటనతో ప్రచారానికి ముగింపు పలకాలని ఆ పార్టీ భావిస్తోంది. ఇక కాంగ్రెస్ తరఫున సీఎం రేవంత్‌రెడ్డి తొమ్మిదోసారి పాలమూరు పర్యటనకు రానున్నారు. మక్తల్‌తో పాటు షాద్‌నగర్ కార్నర్ మీటింగ్‌ను కలుపుకుంటే ఆయన ప్రచారానికి రావడం పదిసార్లు అవుతుంది. నాగర్‌కర్నూల్ బీజేపీ అభ్యర్థి పి.భరత్ ప్రసాద్ తరఫున ప్రచారానికి చివరి రోజు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా హాజరుకానున్నారు. వనపర్తి పాలిటెక్నిక్ మైదానంలో నిర్వహించే బహిరంగ సభలో ఆయన పాల్గొంటారు. అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్.. మరోవైపు బీఆర్‌ఎస్ పాలమూరులోని రెండు ఎంపీ స్థానాల గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. మరీ ముఖ్యంగా మహబూబ్‌నగర్ స్థానం దక్కించుకోవడానికి పార్టీలు ఎత్తుగడలు వేస్తున్నాయి. సీఎం సొంత జిల్లా కావడం, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి బరిలో ఉండటంతో కాంగ్రెస్ పార్టీ గెలుపును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. బీజేపీ తరఫున ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పోటీ చేస్తుండటంతో ఎలాగైనా గెలవాలనే సంకల్పంతో ఆ పార్టీ ఉంది. అలాగే గత అసెంబ్లీ ఎన్నికల్లో చతికిలపడిన బీఆర్‌ఎస్.. ఈ స్థానంలో గెలుపుతో పునర్వైభవం తేవాలని భావిస్తోంది.

తార స్థాయికి ప్రచారం..

కాంగ్రెస్ పార్టీ అధికారికంగా వంశీచంద్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయడానికి కంటే ముందే కోస్గిలో నిర్వహించిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి వంశీచంద్‌ను గెలిపించాలని ప్రకటించి.. ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. బీఆర్‌ఎస్ కూడా అన్ని నియోజకవర్గాల కంటే ముందే ఇక్కడ అభ్యర్థిగా మన్నె శ్రీనివాస్‌రెడ్డి పేరును ఖరారు చేసింది. దీనిని బట్టి చూస్తే అన్ని పార్టీలు మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానాన్ని ఎంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయో అర్థం చేసుకోవచ్చు. సీఎం రేవంత్‌రెడ్డి వంశీచంద్‌రెడ్డికి మద్దతుగా మక్తల్, షాద్‌నగర్ కార్నర్ మీటింగుల్లో ఆయన పాల్గొంటే ప్రచారానికి రావడం పదిసార్లు అవుతుంది. అలాగే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ నాగర్‌కర్నూల్ అభ్యర్థికి మద్దతుగా నిర్వహించిన ఎర్రవెల్లి సభలో పాల్గొన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కూడా వనపర్తి సభకు హాజరుకానుండటంతో బీజేపీ అగ్రనేతలు కూడా పాలమూరుకు వచ్చినట్లవుతుంది.

హామీలపై ఆశలు..



హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు పర్యటించి.. తాను ఈ జిల్లావాసినని, ఇక్కడి ప్రజల బాధ తనకే ఎక్కువగా అర్థమవుతుందని తెలిపారు. అలాగే జిల్లా సమగ్రాంగా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. 'పాలమూరు'కు జాతీయ హోదా ఇవ్వాలని కాంగ్రెస్ పట్టుబడుతుంటే.. 60 శాతం నిధులపై ఇప్పటికే హామీ ఇచ్చారని బీజేపీ చెబుతోంది. అలాగే కృష్ణా- వికారాబాద్ రైల్వేలైన్, కృష్ణా జలాల్లో న్యాయంగా రావాల్సిన వాటాలపై కాంగ్రెస్ పార్టీ ప్రశ్నలు ఎక్కుపెడుతోంది. అయితే ప్రధాని మోదీ నారాయణపేటకు, సీఎం రేవంత్ మక్తల్‌కు వస్తుండటంతో స్పష్టమైన హామీలు, మాటల యుద్ధాలు కొనసాగే అవకాశం కచ్చితంగా ఉందని చెప్పవచ్చు. అలాగే అభ్యర్థులు ఇచ్చిన హామీలపై అగ్రనేతల నోటి నుంచి స్పష్టత వస్తుందని ప్రజలు భావిస్తున్నారు.

తేనెటీగల దాడి

- తప్పించుకునే క్రమంలో ఆయాసానికి గురై యువకుడి మృతి



విస్లావత్ తారక్(ఫైల్)

మన్ననూర్, మే 9 : వ్యవసాయ పొలంలో ట్రాక్టర్‌తో భూమి దున్నుతున్న ఓ యువకుడిపై చెట్టుపై ఉన్న తేనెటీగలు దాడి చేయగా తప్పించుకునే క్రమంలో దుర్మరణం పాలైన విషాదకరమైన ఘటన నాగర్‌కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలంలో గురువారం చోటుచేసుకున్నది. మన్ననూరు గ్రామానికి చెందిన యువకుడు విస్లావత్ తారక్ (22) వ్యవసాయ పొలంలో ట్రాక్టర్‌తో భూమిని దున్నుతూ ఉన్నాడు. వ్యవసాయ పొలంలోనే ఉన్న మామిడి చెట్టుపై తేనెటీగలు తెట్టెను పెట్టాయి. ట్రాక్టర్ భూమిని దున్నే క్రమంలో ఇంజన్ నుంచి వేడితో కూడిన పొగ వ్యవసాయ పొలంలో వ్యాపించింది. దీంతో మామిడి చెట్టుపై ఉన్న తేనెపట్టుపై నుంచి లేచిన ఈగలన్నీ ట్రాక్టర్ నడుపుతున్న తారక్‌పై దాడి చేశాయి. తేనెటీగల దాడి నుంచి తప్పించుకునేందుకు డ్రైవర్ ట్రాక్టర్ దిగి పరుగులుతీశాడు. వ్యవసాయ పొలం వద్దే ఉన్న షెడ్డు వద్దకు వెళ్లి ఆయాసంతో కిందపడిపోయాడు. విషయాన్ని గమనించిన బంధువులు యువకుడిని మొదట మన్ననూరు పీహెచ్‌సీ కి తీసుకెళ్లగా, పరిస్థితి అప్పటికే విషమంగా ఉండడంతో అచ్చంపేట సివిల్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు యువకుడిని పరీక్షించగా అప్పటికే తారక్ మృతి చెందినట్లు నిర్ధారించారు. తారక్ తల్లి 14 ఏళ్ల క్రితమే మృతి చెందగా తండ్రి రాములు ఇద్దరు పిల్లలను పోషిస్తున్నాడు. మృతి చెందిన యువకుడికి సోదరుడు తరుణ్ ఉన్నాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

భూతగాదాలతో యువకుడిపై కత్తితో దాడి

నర్వ, మే 9 : భూతగాదాల కారణంగా ఓ వ్యక్తిని కత్తితో పొడిచి గాయపరిచిన సంఘటన నారాయణపేట జిల్లా నర్వ మండలం రాయికోడ్ గురువారం చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. రాయికోడ్‌కు చెందిన కావలి అంజి రోజు మాదిరిగా పొలం వద్దకు బైక్‌పై వెళ్తున్నాడు. అప్పటికే చెరువు కట్టపై కాపు కాసిన అదే గ్రామానికి చెందిన ఎద్దుల రవి వెంట తెచ్చుకున్న కత్తితో అంజిపై దాడికి పాల్పడ్డాడు. అంజి భుజం, ఛాతిపై ఐదు కత్తిపోట్లు పొడిచి, అక్కడి నుంచి వెళ్లిపోయాడు. చుట్టుపక్కల పొలాల వారు గాయపడిన అంజిని మరికల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని, నిందుతుని అదుపులోకి తీసుకుని విచారణ నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ కుర్మయ్య తెలిపారు.

కోడ్ ముగిసిన వెంటనే.. అమలు





- ఉమ్మడి జిల్లాలో రూ.500 సిలిండర్, ఫ్రీ కరెంటు పథకాలతో లబ్ధి
- ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వర్తింపు
- మొదట ఎమ్మెల్సీ ఉప ఎన్నిక కోడ్, తర్వాత లోక్‌సభ కోడ్‌తో ఇక్కడ బ్రేక్
- ఇప్పటికే రుణమాఫీ పథకం అమలుపై సీఎం రేవంత్ స్పష్టమైన ప్రకటన
- లబ్ధిదారుల్లో చిగురిస్తున్న ఆశలు.. ఉమ్మడి జిల్లాలో లక్షల మందికి లబ్ధి

మహబూబ్‌నగర్, మే 9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్కోటి అమలు చేసుకుంటూ వస్తోంది. మొదట మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంపు పథకాలను ప్రారంభించింది. ఆ తర్వాత ప్రజాపాలన కింద లబ్ధిదారుల నుంచి గ్యారెంటీల అమలు కోసం దరఖాస్తులు స్వీకరించింది. ఇందుకోసం తెల్ల రేషన్‌కార్డును ప్రమాణికంగా పెట్టారు. అయితే గత పదేళ్లుగా రేషన్‌కార్డుల పంపిణీ లేకపోవడంతో ఇబ్బందులు పడ్డ వారికీ ఆ రేషన్‌కార్డులు కూడా ఇచ్చేందుకు దరఖాస్తులను తీసుకుంది. ఆ తర్వాత మరో రెండు పథకాలు రూ.500లకే ఉచిత సిలిండర్, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ పథకాలను ప్రారంభించింది. అయితే రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి 28వ తేదీన ఈ పథకాలు అమలు కాగా.. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో మొదటి రోజు విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లులు ఇచ్చిన అధికారులు.. ఆ తర్వాత మళ్లీ రెగ్యులర్ బిల్లింగ్ చేశారు. అందుకు కారణం ఏంటంటే ఫిబ్రవరి 26వ తేదీన కేంద్ర ఎన్నికల సంఘం ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఉప ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేసింది. కోడ్ ఎఫెక్ట్ పడటంతో ఆ పథకాల అమలు నిలిచిపోయింది. దీంతో లబ్ధిదారులు కొందరు ఆందోళన చెందగా.. కోడ్ ముగిసిన వెంటనే ఉమ్మడి జిల్లాలో కూడా పథకాన్ని అమలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఉప ఎన్నికల కోడ్ అమల్లో ఉండగానే.. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. దీంతో పథకాలు అమలు సాధ్యం కావడం లేదు. ఈ నెల 13వ తేదీన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ జరుగనుండగా.. ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ జూన్ 2న, లోక్‌సభ ఎన్నికల కౌంటింగ్ జూన్ 4న పూర్తవనుంది. ఆ తర్వాతి రోజున కోడ్ తొలగిపోతుంది. ఆ వెంటనే పథకాల అమలు కానున్నాయి.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గృహజ్యోతి లబ్ధిదారులు ఇలా..

జిల్లా	మొత్తం సిలిండర్లు	లబ్ధిదారుల సంఖ్య
మహబూబ్‌నగర్	341202	85979
వనపర్తి	119158	62824
నాగర్‌కర్నూలు	204510	95230
జోగుళాంబ గద్వాల	117467	80923
నారాయణపేట	114937	54919

బిల్లులు చెల్లించడం లేదు..

వాస్తవానికి రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న పథకం.. కేవలం కోడ్ వల్ల ఉమ్మడి జిల్లాలో అమలు కావడం లేదు. కోడ్ ఉన్న సమయంలో జనరేట్ అయిన కరెంటు బిల్లులు.. తర్వాత రీఫండ్ చేస్తారా? లేదా చెల్లించకుండా ఉండాలా? అనే విషయాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదు. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, అభ్యర్థులు, ఎమ్మెల్యేలు 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే వారు అభయహస్తంలో దరఖాస్తు చేసుకుని ఉంటే చెల్లించాల్సిన అవసరం లేదని హామీ ఇస్తున్నారు. ఈ హామీతో లబ్ధిదారుల్లో కొంత ఊరట లభించిందని చెప్పొచ్చు. అలాగే ఎవరైనా కరెంటు బిల్లులు చెల్లించాలని వేధిస్తే తమ దృష్టికి తేవాలని చెప్పడంతోపాటు.. విద్యుత్ శాఖ అధికారులకు కూడా తగిన సూచనలు చేస్తున్నారు. సబ్సిడీ సిలిండర్ పథకం కింద ఉమ్మడి పాలమూరులోని ఐదు జిల్లాల్లో 3.79 లక్షల మందికి లబ్ధి చేకూరుతుందని అంచనాలు ఉన్నాయి. అన్ని జిల్లాల్లో కలిపి 8.97 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉండగా.. 9.14 లక్షల మందికి తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయి. అయితే ఈ సంఖ్య ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత మరింత పెరిగే అవకాశం కచ్చితంగా ఉందని చెప్పొచ్చు. కొందరికి రేషన్ కార్డులు లేకపోవడం, గ్యాస్ కనెక్షన్లు ఉన్నా.. జాయింట్ కార్డులు ఉండటం మూలంగా ఈ ఇబ్బంది ఏర్పడింది. అలాగే రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ కూడా ప్రారంభిస్తే.. మరింత మందికి లబ్ధి చేకూరనుంది. అలాగే ఉమ్మడి పాలమూరు జిల్లాలో 8.46 లక్షల గృహ విద్యుత్ కనెక్షన్లు ఉండగా.. జనవరి నెల వరకు ఉన్న అంచనాల ప్రకారం 7.06 లక్షల మంది 200 యూనిట్ల కంటే తక్కువ విద్యుత్ వినియోగించారు. పథకం ప్రారంభానికి ముందు నెలను ప్రామాణికంగా తీసుకుంటే దాదాపు 87 శాతం మంది లబ్ధి పొందే అవకాశం కచ్చితంగా ఉంది. ఇదిలా ఉంటే రుణమాఫీ విషయంలో ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి పలుమార్లు స్పష్టమైన ప్రకటన చేశారు. ఆగస్టు 15వ తేదీలోపు రాష్ట్రంలో రూ. రెండు లక్షల లోపు రుణాలు తీసుకున్న రైతులందరికీ మాఫీ చేస్తామని ప్రకటించారు. ఈ విషయంపై కూడా రైతుల్లో సానుకూలత వ్యక్తమవుతోంది.

ఉమ్మడి జిల్లాలోని 200 యూనిట్లలోపు విద్యుత్ వాడే వినియోగదారుల వివరాలు

జిల్లా	వినియోగదారుల సంఖ్య
మహబూబ్‌నగర్	232186
నారాయణపేట	100000
జోగుళాంబ గద్వాల	118252
వనపర్తి	121341
నాగర్‌కర్నూల్	134561

పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాల ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు

కొల్లాపూర్, మే 9 : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటును వినియోగించుకోవాలని కోరుతూ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కొల్లాపూర్ మండల పరిధిలోని ఎల్లూరు, ముక్కిడిగుండం, మొలచింతలపల్లి గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా ఉండేందు కోసం పోలీసులు, కేంద్ర బలగాలు కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి కుమార్‌దీపక్, సీఐ మహేష్, ఎస్‌ఐ రుషికేష్‌లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఏఆర్‌వో కుమార్‌దీపక్, సీఐ మహేష్‌లు మాటాడుతూ ప్రజలు ఈ ఎన్నికల్లో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా స్వేచ్ఛగా తమ ఓటును వినియోగించుకోవాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు.

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. నిబంధనలను అతిక్రమించి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడరాదన్నారు. ఏఈఆర్‌వో శ్రీకాంత్, సీఆర్‌పీఎఫ్ కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

కాంగ్రెస్ పార్టీతోనే బడుగుల అభివృద్ధి

- కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి



ఎన్నికల ప్రచారానికి వెళ్లే ముందు కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి

తాడూరు, మే 9 : మరికొద్ది రోజుల్లో జరగబోతున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచినట్లయితే బడుగు బలహీన వర్గాల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి అన్నారు. గురువారం మండల కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి పనులే దేశవ్యాప్తంగా చెప్పుకోదగినవిగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో పేదలు, బడుగు బలహీన వర్గాల వారందరూ ఉపయోగించుకుంటున్న ఉపాధి హామీ పథకాన్ని తెచ్చింది కేంద్రంలో ఉన్న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. ఓటర్లందరూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి కాంగ్రెస్‌కు మద్దతివ్వాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఉండే కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఈ నాలుగు రోజులపాటు శక్తివంచన లేకుండా కృషి చేసి పార్టీ గెలుపునకు శ్రమించాల్సిందిగా సూచించారు. తాడూరు జడ్పీటీసీ మండడి రోహిణి, ఎంపీటీసీ రేణుక, పార్టీ శ్రేణులు, గోవర్ధన్‌రెడ్డి, మల్లయ్య ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

● మంత్రి జూపల్లి కృష్ణారావు

చారకొండ, మే 9: గ్రామాల అభివృద్ధి, పేదల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండల కేంద్రంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కాంగ్రెస్ శ్రేణులతో కలిసి మంత్రి రోడ్డు షోలో పాల్గొని మాట్లాడా రు. దేశంలో ప్రజాస్వామ్య రక్షణకు కాంగ్రెస్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. కేంద్రంలో 10 ఏళ్లుగా ప్రధానమంత్రిగా పనిచేసిన నరేంద్ర మోదీ దేశానికి చేసింది చెప్పుకునే స్థితిలో ఏమి లేదని అన్నారు. నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే ఈ ప్రాంతం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందడానికి అవకాశం ఉందని అన్నారు. అనంతరం అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే 5 గ్యారంటీలను అమలు చేసి మాట నిలబెట్టుకుందని అన్నారు. అనంతరం మల్లురవి సతీమని డాక్టర్ రాజ భాస్నిదేవి, జడ్పీ వైస్ చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, పీసీసీ ప్రధాన కార్యదర్శి చారకొండ వెంకటేష్, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ తుంగ మోపతయ్య మాట్లాడారు. డీసీసీ ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్యయాదవ్, అచ్చంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్‌గౌడ్, మాజీ సర్పంచ్ గుండె విజేందర్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్, సింగిల్‌విండో చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్, ఎంపీటీసీ గ్యార లక్ష్మయ్య, మండల వర్కింగ్ ప్రసిడెంట్ పానుగంటి అంజయ్య, పీఏసీఎస్ డైరక్టర్ జగన్‌మోహన్, మండల యూత్ ప్రసిడెంట్ గణేష్‌గౌడ్, సీపీఐ జిల్లా నాయకుడు డాక్టర్ సిహెచ్ శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ భీముడునాయక్, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.


చారకొండలో జరిగిన రోడ్‌షోలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● వంగూరు: మహిళా సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేమని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండలంలోని వంగూరు గేట్ వద్ద ఓ ఫంక్షన్ హాలులో మహిళా మేలుకో జరిగిన సభలో మాజీ మంత్రి రవీంద్రనాయక్, ఎమ్మెల్యే వంశీకృష్ణలతో మంత్రి జూపల్లి కృష్ణారావు పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి సతీమణి డాక్టర్ రాజా భాస్నిదేవి, జడ్పీటీసీ కేవీఎన్‌రెడ్డి, ఎంపీటీసీ రమేష్‌గౌడ్, డాక్టర్ తుంగ మోపతయ్య, ఎంపీపీ బీమమ్మ, మండల పార్టీ అధ్యక్షుడు పండిత్‌రావు, జనార్ధన్, పాండురంగారెడ్డి, యాదగిరిరావు, అల్వాల్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ భీముడునాయక్, నారాయణరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, చెన్న రాములుగౌడ్, రాజయ్యయాదవ్, శ్రీను, సత్యనారయణ, విష్ణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● వెల్దండ: రాష్ట్రంలో ప్రజా సంక్షేమ పాలన కేవలం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి పార్లమెంటు అభ్యర్థి డాక్టర్ మల్లురవికి మద్దతుగా వెల్దండలో జూపల్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలో నాయకులు, కార్యకర్తలతో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. జిల్లాపరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, మాజీమంత్రి చిత్తరంజన్‌దాసు తదితరులున్నారు.

భర్త, అత్తమామల వేధింపులతోనే

మా కూతురు ఆత్మహత్య

- న్యాయం జరిగేంతవరకు అంత్యక్రియలు జరిగేది లేదు
- మృతురాలి బంధువుల ఆందోళన
- పిల్లల పేర పదెకరాల భూమి రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్
- మూడురోజుల నుంచి ఇంటి ముందే శవం

నాగర్‌కర్నూల్ క్రైం, మే 9: భర్త సతీష్‌రెడ్డి, అత్తమామల వేధింపులతోనే మా కూతురు స్వాతి(30) ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి బంధువులు ఆరోపించారు. పిల్లలకు న్యాయం జరిగేంత వరకు మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేది లేదని మృతురాలి బంధువులు ఆందోళన చేసిన సంఘటన నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడలో గురువారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని ఉయ్యాలవాడకు చెందిన చింతకుంట సతీష్‌రెడ్డి బిజినేపల్లి మండలం లింగసానిపల్లికి చెందిన స్వాతితో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక బాబు, పాప ఉన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటూ హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న సతీష్‌రెడ్డి తరచుగా స్వాతిని వేధించేవాడు. అక్రమ సంబంధంపై నిలదీయడంతోనే మా కూతురును చిత్రహింసలకు గురిచేసేవాడని, మనస్తాపానికి గురైన స్వాతి మంగళవారం ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందిందన్నారు. ఈ సంఘటనపై వనస్థలిపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదై శవాన్ని ఉయ్యాలవాడకు తీసుకువచ్చారు. దీంతో పసిపిల్లలకు న్యాయం జరిగేంత వరకు అంత్యక్రియలు జరిగేది లేదని... గత మూడు రోజుల నుంచి స్వాతి మృతదేహాన్ని సతీష్‌రెడ్డి ఇంటి ముందు ఉంచి స్వాతి బంధువులు ఆందోళనకు దిగారు. దీంతో సతీష్‌రెడ్డి పేర ఉన్న పదెకరాల భూమిలో అరెకరాలు ఇద్దరు పిల్లల పేరుమీద రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేయడంతో గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ కనకయ్య, ఎస్ఐ గోవర్ధన్‌తో పాటు పోలీస్ సిబ్బంది గ్రామానికి చేరుకుని పికెటింగ్ ఏర్పాటు చేసి సతీష్‌రెడ్డితో పాటు వారి కుటుంబ సభ్యులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భూమి పిల్లల పేరు మీద రిజిస్ట్రేషన్ చేసేందుకు సతీష్‌రెడ్డి కుటుంబ సభ్యులు రాజీ అయినప్పటికీ గార్డియన్‌గా తానే ఉంటానని పిల్లల తండ్రి తెలపడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తమైంది. గ్రామ పెద్దల సమక్షంలో పిల్లల మేనమామ సందీప్‌రెడ్డిని గార్డియన్‌గా ఉంచేందుకు ఒప్పందమైంది. దీంతో భూమి రిజిస్ట్రేషన్ చేసేందుకు పెద్దల సమక్షంలో ఆన్‌లైన్‌లో చేయడంతో రిజిస్ట్రేషన్ శుక్రవారానికి నమోదైంది. పిల్లల పేరు మీద రిజిస్ట్రేషన్ అయ్యేంత వరకు అంత్యక్రియలు జరగనివ్వమని మృతురాలి బంధువులు అక్కడే తిష్ట వేసి కూర్చొన్నారు. తమ కూతురిని అత్త కమలమ్మ, మామ నిరంజన్‌రెడ్డి, భర్త సతీష్‌రెడ్డిలు తరచూ వేధించేవారని వారి వేధింపులకు తట్టుకోలేకనే మా కూతురు ఆత్మహ త్యకు పాల్పడిందని వారు పేర్కొన్నారు.


స్వాతి (ఫైల్)

108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం

లింగాల, మే 9: మండల పరిధిలోని అప్పాయిపల్లికి చెందిన కాత్రాజు మానస అంబులెన్స్‌లోనే ప్రసవం జరిగిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. మహిళకు పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. అంబులెన్స్‌లో మహిళను అచ్చంపేటకు తీసుకవెళుతున్న సమయంలో మార్గ మధ్యలో నొప్పులు అధికం కావడంతో సిబ్బంది ఆశ కార్యకర్త సహాయంతో అంబులెన్స్‌లోనే ప్రసవం చేశారు. మగ బిడ్డకు జన్మనిచ్చింది. శిశువును, తల్లిని మెరుగైన చికిత్సకై అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పినట్లు అంబులెన్స్ సిబ్బంది లక్ష్మన్, ఖాజా తెలిపారు.

'కాంగ్రెస్‌తోనే ప్రజలకు న్యాయం'

తెలకపల్లి, మే 9 : కాంగ్రెస్ పార్టీతోనే దేశ ప్రజలకు న్యాయం జరుగుతుందని టీపీసీసీ డాక్టర్స్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మాణిక్యాల చెన్నయ్య అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవికి మద్దతుగా గురువారం టీపీసీసీ డాక్టర్స్ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ మాణిక్యాల చెన్నయ్య, జడ్పీటీసీ సుమిత్రల ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఐదు గ్యారెంటీలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాణిక్యాల చెన్నయ్య మాట్లాడుతూ ప్రజా నాయకుడు సమస్యలపై పోరాడే అభివృద్ధి ప్రదాత పిలిస్తే పలికే మల్లురవిగా పేరుగాంచిన డాక్టర్ మల్లు రవిని అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. డాక్టర్ మల్లురవి సోదరుడు మల్లు ప్రసాద్, డాక్టర్ శంకరయ్య, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- యువకుడి ప్రాణాలు కాపాడిన పోలీసులు

అమరచింత, మే 9: మతిస్థిమితం లేని వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ జూరాల ప్రాజెక్టులో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్ నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం , ఉంద్యాల గ్రామానికి చెందిన మహబూబ్ కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిసింది. దీంతో జూరాల ప్రాజెక్టులో చనిపోవాలనుకుంటూ మహబూబ్ జూరాల ప్రాజెక్టు వైపు వెళ్తున్నాను అని చెబుతు వెళ్లడంతో ప్రాజెక్టుపై గమనించిన కొందరు 100కు డయల్ చేశారు. దీంతో ఎస్ఐ సురేష్ పోలీస్ సిబ్బందితో పాటు అగ్నిమాపక సిబ్బందితో కలిసి హుటా హుటి న జూరాల ప్రాజెక్టుకు వెళ్లారు. పక్కా సమాచారంతో వెళ్లిన పోలీసులు ప్రాజె క్టుపై మహబూబ్ కోసం అన్వేషించగా అప్పటికే మహబూబ్ జూరాల ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో దూకి ఉన్నాడు. ప్రాజెక్టులో నీటి శాతం తక్కువ ఉండడంతో బ్యాక్ వాటర్‌లో దూకి నీటి ప్రభావం లేని కారణంగా అతను ఓ పక్కన రాయిని పట్టుకొని బిక్కుబిక్కుమంటూ ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నాడు. మ హబూబ్ కోసం అప్పటికే అన్వేషణలో పోలీసులు అతడు ఉన్న ప్రాంతాన్ని గ మనించారు. దీంతో ప్రత్యేకత తాడు సేఫ్టీ బెలూన్ మత్స్యకారుల సహాయం తో చాకచక్యంగా ఒడ్డుకు లాగారు. బయటికి వచ్చిన మహబూబ్ ను విచారించి ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు పోలీసులు అడిగి తెలుసుకున్నారు. దీంతో అతనిని అక్కడి నుంచి అమరచింత పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మానసిక రోగి అయినా అతనిని ఆసుపత్రి చికిత్స నిమిత్తం వారి కుటుంబ సభ్యులను అప్పజెప్పారు. 100 డయల్‌తో హుటాహుటిన జూరాల ప్రాజెక్టు వద్దకు సమయానికి వెళ్లి ప్రాణాలను కాపాడినఎస్ఐ సురేష్, సిబ్బందినిపలువురు అభినందించారు.

నగదు పట్టివేత



పట్టుబడిన నగదుతో పోలీసులు

బాలానగర్, మే 9 : మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద పోలీసుల వాహనాల తనిఖీలు చేస్తుండగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్ జిల్లా ఎమ్మిగనూర్ మండలం గోనెగండ్లకు చెందిన కె.చంద్ర అనే వ్యక్తి వద్ద ఉన్న రూ.57వేలు కనిపించడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తిరుపాజీ తెలిపారు. పట్టుబడిన డబ్బులకు సంబంధించిన ధ్రువపత్రాలను చూయించి తిరిగి పొందవచ్చని ఎస్‌ఐ తెలిపారు.

టైరు పేలి డ్రైవర్ దుర్మరణం

» మృతుడు కర్నూలు జిల్లా వాసి

అలంపూర్ చౌరస్తా, మే 9 : పంచర్ షాపు వద్ద టైరు విప్పుతున్న మెకానిక్‌కు సాయం చేస్తుండగా, ఒక్కసారి టైరు పేలిపోవడంతో లారీ డ్రైవర్ తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ నాయక్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కర్నూలు జిల్లా గోనేగండ్ల మండలానికి చెందిన హరికృష్ణ (39) సిమెంట్ లారీ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. బుధవారం కర్నూలు జిల్లా, అవుకు మండలం, కొలిమిగుండ్ల గ్రామంలోని రామ్‌కో ఫ్యాక్టరీ నుంచి సిమెంటు లోడు చేసుకొని అయిజకు బయలుదేరాడు. పుల్లూరు టోల్‌ప్లాజా దాటాక లారీ వెనుక వైపు లోపలి టైరు పంచర్ అయ్యింది. దీంతో లారీని ఓ పంచర్‌షాపు వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ టైరు బోల్టులు విప్పుతున్న మెకానిక్‌కు సాయం చేస్తుండగా, అది ఒక్కసారిగా పేలడంతో హరికృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని చికిత్స నిమిత్తం కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. గురువారం భార్య వరలక్ష్మి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి



అచ్చంపేట, మరికల్ గ్రామాల్లో విద్యుదాఘాతంతో మృతి చెందిన గేదెలు

అచ్చంపేట టౌన్, మే 9 : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో కురిసిన భారీ వర్షం కారణంగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై గేదె మృతి చెందిన సంఘటన గురువారం పట్టణంలోని గోకుల్ నగర్ కాలనీలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన శివ గేదెలు పొలం దగ్గర నుంచి సాయంత్రం ఇంటి వచ్చేసమయానికి పట్టణంలో భారీ వర్షం కురియడంతో విద్యుత్ స్తంభం వద్ద వర్షపు నీరు నిలిచాయి. గేదె స్తంభం దగ్గర నుంచి నీటిలో దిగగానే షాక్‌కు గురికావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న విద్యుత్ ఏఈ ఆంజనేయులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. వర్షం కారణంగా స్తంభానికి విద్యుత్ సరఫరా అయినట్లు ఆయన తెలిపారు. పట్టణంలో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

మరికల్‌లో..

పెద్దకొత్తపల్లి : మండల పరిధిలోని మరికల్ గ్రామంలో బీరం యాదమ్మకు చెందిన గేదె ప్రమాదవశాత్తున విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందినట్లు బాధితురాలు గురువారం తెలిపారు. మరికల్ గ్రామానికి చెందిన బీరం యాదమ్మ తన గేదెలను మేపుకురావడానికి తన వ్యవసాయ పొలం దగ్గరికి వెళ్లింది. బుధవారం సాయంత్రం విపరీతమైన ఈదురుగాలులు రావడంతో కింద తెగిపడ్డ వైర్లకు తగిలి గేదె మృతి చెందినట్లు ఆమె పేర్కొన్నారు. మృతి చెందిన గేదె విలువ సుమారు 80వేల రూపాయలు ఉంటుందని బాధితురాలు తెలిపారు. ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆమె కోరారు.

కార్మిక సంఘాల చర్చలు విఫలం



చర్చల్లో పాల్గొన్న బీడీ కంపెనీల యజమానులు

పాలమూరు, మే 9 : బీడీ కార్మికుల వేతనాలు పెంచాలని, పీఎఫ్ అమలు చేయాలని, చట్టం ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వా లని కార్మిక సంఘాల నాయకులతో గురువారం జిల్లా కేంద్రంలోని ఒక హోటల్‌లో చేపట్టిన చర్చలు విఫలమయ్యాయి. టీఎఫ్‌టీయూ, ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ, ఏఐటీయూసీ, బీఆర్‌ఎస్‌వీ, ఐఎన్‌టీయూసీ తదితర సంఘాల నాయకులు చర్చల్లో పాల్గొన్నారు. గతంలోనే బీడీ కార్మికుల వేతన ఒప్పందం కోసం డిమాండ్ నోటీసు ఇచ్చారు. డిమాండ్ నోటీసుపై రెండు సార్లు హైదరాబాద్‌లో కార్మిక సంఘాల నాయకులకు, బీడీ ఫ్యాక్టరీ యజమానులకు మధ్య చర్చలు జరిగి విఫలమయ్యాయి. మూడోసారి మహబూబ్‌నగర్ పట్టణంలో జరిగాయి. ఈ చర్చల్లోనూ పీఎఫ్ గ్రాట్యుటీ వేతనాలకు సంబంధించిన అంశం పరిష్కారం కాకపోవటంతో ఈనెల 16వ తేదీకి చర్చలు వాయిదా పడ్డాయి. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి నూతన ఒ ప్పందం అమలులోకి రావాలసి ఉంది. నెలరోజులు గడిచినప్పటికీ సమస్యలు తక్షణం పరిష్కరించకుండా వాయిదాలు వేయడం పట్ల కార్మిక సంఘాల నాయ కులు అసంతృప్తి వ్యక్తం చేశారు. బీడీ యాజమాన్యం తరఫున సోయల్‌సేట్, సుధాకర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వజీసేటులు పాల్గొన్నారు. కార్మిక సంఘాల ప్రతినిధులుగా టీఎఫ్‌టీయూ నుంచి ఎస్.యం ఖలీల్, పి.యాదగిరి, ఐఎఫ్‌టీయూ నుంచి కె.సూర్యం, పి.అరుణ్‌కుమార్, సీఐటీయూ నుంచి ఎం.డి. మహమూద్, బి.వేణుగోపాల్, ఏఐటీయూసీ నుంచి వెంకటేష్, శ్యాంసుందర్, బీఆర్‌ఎస్‌కేవీ, నాయకులు అబ్రహం, ఐఎన్‌టీయూసీ నాయకులు బాలరాజు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రి వద్ద మృతుడి బంధువుల ఆందోళన



ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టిన మృతుడి బంధువులు

పెబ్బేరు, మే 9 : పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట మృతుడి బంధువులు ఆందోళన చేశారు. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కొత్తకోట మండలం నాటవెల్లి తండాకు చెందిన రాజునాయక్ (19) అనారోగ్యంతో బాధపడుతూ పెబ్బేరులోని ఓ ఆస్పత్రిలో రెండు రోజులుగా చికిత్స పొందాడు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఆసుపత్రి సిబ్బంది ఆలసత్వం వల్లే తమ కుమారుడు చనిపోయాడని వారి బంధువులు గురువారం ఆసుపత్రి ముందు శవాన్ని ఉంచి ఆందోళన చేశారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని వారికి నచ్చ జెప్పి ఆందోళన విరమింపజేశారు. కాగా మృతుడి బంధువులకు నష్టపరిహారం కింద కొంత డబ్బు చెల్లించేందుకు ఆసుపత్రి యాజమాన్యం ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది.

వానాకాలానికి సన్నద్ధం

» జోగుళాంబ గద్వాల జిల్లాలో 4.26 లక్షల ఎకరాల్లో పంటల సాగు
» జిల్లాకు 1.13 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం
» అంచనా వేసిన వ్యవసాయ శాఖ అధికారులు
» 1.45 లక్షల ఎకరాలకు రాయితీ విత్తనాల కోసం ఇండెంట్



మానవపాడు మండలంలో విత్తనాలు వేస్తున్న రైతులు (ఫైల్)

గద్వాల, మే 9 : ఖరీఫ్ నాటికి ఎరువులు, విత్తనాలను సిద్ధం చేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. జిల్లాకు మొత్తం 4.26 లక్షల ఎకరాలకు 1.13 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం అవుతాయని అంచనా వేశారు. ఇప్పటికే డీలర్ల, గోదాముల్లో దాదాపు 10వేల మెట్రిక్ టన్నుల యూరియా, 20 వేల మెట్రిక్ టన్ను ల కాంప్లెక్స్ ఎరువులు ఉన్నట్లు రికార్డులు చెబుతున్నాయి. మిగిలిన ఎరువులకు వ్యవసాయ శాఖ అధికారులు ఇండెంట్ పెట్టారు. తొలకరి వర్షాలు కురిసేనా టికి కనీసం 50 శాతం ఎరువులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నారు. అదేవిదంగా 1.45 లక్షల ఎకరాలకు రాయితీ విత్తనాల కోసం ఇండెంట్ పెట్టారు.

అందుబాటులో 30 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు

జిల్లాలో ఖరీఫ్ పూర్తయ్యేసరికి దాదాపు 1.13 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏ నెలలో ఎంతమేరకు అవసరం అవుతాయో కూడా లెక్కలు తీశారు. ఇప్పటికే జిల్లాలో 30 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. ఇంకా 87 వేల మెట్రిక్ టన్నుల ఎరువులకు డిమాండ్ పెట్టారు. ఇందులో యూరియా 35,130, డీఏపీ 12,120, సింగిల్ సూపర్ పాస్పేట్ 4,070, అమోనియా సల్ఫేట్ 2,660, పొటాష్ 5,950, కాంప్లెక్స్ ఎరువులు 53,123 మెట్రిక్ టన్నులు అవసరమవుతాయని అధికారులు అంచనా వేశారు.

పెరగనున్న సాగు విస్తీర్ణం

వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలని వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధం అయ్యారు. జిల్లాలో దాదాపు 4.26లక్షల ఎకరాలలో వివిధ పంటలు సాగవుతాయని అంచనా వేస్తున్నారు. గత ఏడాదికంటే ఈ ఏడాది దాదాపు 40 వేల ఎకరాల సాగు పెరిగే అవకాశం ఉంది. గత ఖరీఫ్‌లో వర్షాలు అంతంతమాత్రంగానే కురువడంతో, సాగు విస్తీర్ణం తగ్గింది. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని వాతావరణ శాఖ నిపుణులు చెప్పుండటంతో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. అందుకు తగినట్లుగా అధికారులు ఎరువులు, విత్తనాల డిమాండ్‌ను తయారు చేసి ప్రభుత్వానికి నివేదించారు. ఇప్పటికే అన్ని ఎరువులు, విత్తనాల దుకాణాలు, డీలర్లు, గోదాముల్లోని నిల్వలను తనిఖీ చేశారు. ఇంకా ఏ మేరకు అవసరం అవతా యో నివేదికలను సిద్ధం చేశారు.

జిల్లాలో 3.30 లక్షల ఎకరాలలో సాగు

జోగుళాంబ గద్వాల జిల్లాలో వానాకాలంలో వివిధ పంటలు దాదాపు 3.30లక్షల ఎకరాలలో సాగు చేస్తారు. . గత ప్రభుత్వం విత్తనాలకు సబ్సిడిలు ఇవ్వకపోవడంతో పదేళ్ల నుంచి ఈ విత్తనాలను రైతులు ప్రయివేటు మార్కెట్‌లో ఎక్కువ ధర చెల్లించి కొనుగోలు చేశారు. కొన్ని సందర్భాలలో ప్రయివేటు కంపినీలు నాణ్యతలేని విత్తనాలను అంటగట్టి ఇవ్వడంతో సరైన పంటదిగుబడి రాక నష్ట పోయిన రైతులు ఉన్నారు. అయితే ప్రభుత్వం రాయితీ విత్తనాలు ఇవ్వకపోవడంతో చేసేది లేక ఎవరిదగ్గర పడితే వారిదగ్గర రైతులు విత్తనాలను కొనుగోలు చేశారు. కానీ మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం రాయితీ విత్తనాలు అందిస్తామని ప్రకటించడంతో రైతులలో ఆశలు కలిగాయి. వాటికోసం ఎదురు చూస్తున్నారు.

రాయితీ విత్తనాల కోసం ఇండెంట్

జిల్లాలో ప్రధానంగా వరి, కందులు, మొక్కజొన్న, మిరప, వేరుశనగ, ఆముదం, జొన్న, సజ్జ తదితర పంటలు సాగు చేస్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులకు రాయితీపై విత్తనాలు అందిస్తామని చెప్పడంతో, అందుకు అనుగుణంగా అధికారులు ఇండెంట్ పంపించారు. వరి 83,350 ఎకరాలకు 20,887 క్వింటాళ్లు, కందులు 23,690 ఎకరాలకు 710క్వింటాళ్లు, మొక్కజొన్న 14,100 ఎకరాలకు 1,128 క్వింటాళ్లు అవసరం అవుతాయని నివేదించారు. ఎర్ర మిరప 15,123 ఎకరాలకు 15 క్వింటాళ్లు, వేరుశనగ 7,085 ఎకరాలకు 4,251 క్వింటాళ్లు, సజ్జలు 250 ఎకరాలకు ఐదు క్వింటాళ్లు, ఆముదం 1,478 ఎకరాలకు 29 క్వింటాళ్లు, మినుములు 456 ఎకరాలకు 36 క్వింటాళ్లు, ఇతర పంటలు 175 ఎకరాలకు పది క్వింటాళ్ల వరకు రాయితీ విత్తనాలు అవసరమని ఇండెంట్ పెట్టారు. మిగిలి విత్తనాలు స్థానికంగా డీలర్లు, విత్తన దుకాణాల్లో అందుబాటులో ఉండేలా చూస్తున్నారు. ఈ సారి విత్తనాల నాణ్యతను ధ్రువీకరించిన తర్వాతే మార్కెట్‌లో అందుబాటులో తేనున్నారు.

ఖరీఫ్‌కు సిద్ధం అయ్యాం

ఖరీఫ్‌కు సిద్ధం అయ్యాం. ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని అంచనాలు ఉన్నాయి. అందుకు తగినట్లు ఎరువులు, విత్తనాలను సిద్ధం చేస్తున్నాం. ఇప్పటికే ఎరువుల లెక్కలు తీశాం. కావలిసిన ఎరువులకు ఇండెంట్ పెట్టాం. అదే విధంగా రాయితీ విత్తనాలకోసం ప్రభుత్వానికి నివేదించాం.

- గోవిందనాయక్, జిల్లా వ్యవసాయ అధికారి, గద్వాల

సకాలంలో విత్తనాలు అందేనా?

గత పదేళ్లుగా రాయితీ విత్తనాలు లేని రైతులకు ఈ ప్రభుత్వం రాయితీ విత్తనాలు అందిస్తుండటంతో అవి సకాలంలో అందేనా...? అనే అనుమానంతో ఉన్నారు. జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. అప్పటి వరకు విత్తనాలను ప్రభుత్వం సిద్ధం చేయాలి. తెలంగాణ విత్తన కంపినీలు, జాతీయ విత్తన కంపినీల నుంచి వీటిని సేకరించుకోవాలి. అప్పటి వరకు ప్రభుత్వం టెండర్లను పిలవాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో రాయితీ విత్తనాల పంపిణీపై అనుమానాలు ఉన్నాయి. ఇప్పటికే రాయితీ విత్తనాల సేకరణకు వ్యవసాయ కమీషనర్ ఎన్నికల సంఘానికి విన్నవించుకోగా జీలుగ, పచ్చిరొట్టకు మాత్రమే అనుమతి ఇచ్చింది. మిగిలిన వాటికి ఎప్పటి వరకు అనుమతులు వస్తాయో తెలియని పరిస్థితి ఉంది. దీంతో ఈ ఖరీఫ్ సీజన్‌కు అందేనా అనే అనుమానాలు ఉన్నాయి.

1.45 లక్షల ఎకరాలకు 27 వేల క్వింటాళ్ల విత్తనాలు

జిల్లాలో ప్రదానంగా సాగుచేసే పంటలకు రాయితీ విత్తనాలకోసం అధికారులు ఇండెంట్ పెట్టారు. ఇందులోఅవసరమని అధికారులు ఇండెంట్ తయారు చేసి రాష్ట్ర వ్యవసాయ కమిషనర్‌కు నివేదించారు.



అమ్రాబాద్ సమీపంలోని వాగులో పారుతున్న వర్షపు నీరు, అచ్చంపేట ప్రధాన రహదారి వ్యాపార సముదాయాల వద్ద ప్రవహిస్తున్న మురుగునీరు

చల్లబడ్డ వాతావరణం

» తగ్గిన ఉష్ణోగ్రతలు » కౌకుంట్లలో 40.7 మి.మీ. వర్షపాతం



గద్వాలలో కురిసిన వర్షంతో నిలిచిన నీళ్లు

మహబూబ్‌నగర్/ అచ్చంపేటటౌన్/ నాగర్‌కర్నూల్ టౌన్/ గద్వాల/మన్ననూర్/వనపర్తి అర్బన్ మే 9 : అకాల వర్షాలతో పాలమూరు చల్లబడింది. రెండ్రోజులుగా జిల్లాలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో వాతావరణంలో మార్పు చోటుచేసుకున్నది. దీంతో ఉష్ణోగ్రతలు 5 డిగ్రీల మేరకు పడిపోవడంతో వడగాలులు, ఉక్కపోతతో ప్రజలకు ఉపశమనం లభిస్తోంది.

● గద్వాల జిల్లా వడ్డేపల్లిలో 41.2, ధరూర్‌లో 40.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

● మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్‌లో 40 డిగ్రీలు నమోదుకాగా, సీసీకుంటలో 39.8, అడ్డాకుల, దేవరకద్ర, కౌకుంట్లలో 39.7, మహబూబ్‌నగర్, బాలానగర్‌లో 39.5 డిగ్రీలు నమోదుకాగా మిడ్జిల్‌లో 36.8 డిగ్రీలు నమోదైంది.

● వనపర్తి జిల్లా పెబ్బేరు మండలంలో 40.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కొత్తకోట, అమరచింత 39.9, ఆత్మకూరు 39.7, పాన్‌గల్ 39.6, ఘణపూర్, శ్రీరంగాపూర్ 39.5, వనపర్తి 39.4, పెద్దమందడి 39.2, గోపాల్‌పేట 39.1, మదనాపూర్ 38.7, ఘణపూర్ 38.7, చిన్నంబావి 38.3, వీపనగండ్ల 37.5 , రేవల్లి 36.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

● నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలో 40.0 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కల్వకుర్తిలో 39.8, వెల్దండలో 39.7, నాగర్‌కర్నూల్‌లో 39.6, పెంట్లవెల్లిలో 39.5, పెద్దకొత్తపల్లిలో 39.3, వంగూరులో 39.2, చారకొండలో 39.0, బల్మూరులో 38.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అక్కడక్కడ కురిసిన వర్షం

మహబూబ్‌నగర్ జిల్లాలో బుధవారం అర్ధరాత్రి అక్కడకక్కడ వర్షం కురిసింది కౌకుంట్లలో అరగంటకు పైగా భారీ వర్షం కురిసింది. ఇక్కడ 40.7 మి.మీ. వర్షపాతం నమోదైంది. దేవరకద్రలో 11.9, కోయిల్‌కొండలో 7.5, సీసీకుంటలో 5, మి.మీ. వర్షం కురువగా జిల్లాలో సగటున 4.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

● అచ్చంపేటలో కురిసిన భారీ వర్షంతో ప్రధాన రహదారి జలమయంగా మారింది. రోడ్లపై నీరు చేరింది.

● జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాలో గురువారం తెల్లవారుజామున వర్షం దంచికొట్టింది. అయిజలో 67.5 మి.మీ., గద్వాలలో 48.5 ఎంఎం, ధరూర్‌లో 32.8, ఇటిక్యాలలో 21, కేటీదొడ్డిలో 10మి.మీ. వర్షం కురిసింది.

● ఉమ్మడి అమ్రాబాద్ మండలం, నల్లమల అభయారణ్య ప్రాంతంలో గురువారం మధ్యాహ్నం ఆదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మన్ననూరు, అమ్రాబాద్, జంగంరెడ్డిపల్లి, మాచారం, తుర్కపల్లి, ప్రశాంత్‌నగర్, కొత్తపల్లి గ్రామాలతో పాటుగా, పులుల అభయారణ్యంలోని మల్లాపూర్, పర్హాబాద్, గుండం వాగుదారి, కొమ్మన పెంట, కొల్లం పెంటల్లో గంటన్నరకు పైగా వర్షం కురిసింది. మండల పరిధిలోని అడవుల్లోని పలు వాగులు నీటితో పారాయి. ఇటీవల 3 పర్యాయాలు నల్లమలలో ఓ మోస్తరు వర్షాలు కురవడంతో అధిక ఉష్ణోగ్రతల నుంచి ప్రజలకు ఉపశమనం కల్గింది. ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. ట్రాక్టర్లతో దుక్కులను దున్నించే పనులకు శ్రీకారం చుట్టారు.

చోరీ కేసులో దోషులకు జైలు శిక్ష

అలంపూర్ చౌరస్తా, మే 9 : చోరీ కేసులో దోషులకు జైలు శిక్ష విధిస్తూ న్యా యాధికారి తీర్పునిచ్చారు. కేసు వివరాలను ఎస్పీ రితిరాజ్ గురువారం ఒక ప్రక టనలో వెల్లడించారు. వివరాలిలా ఉన్నాయి. మానవపాడు మండల పరిధిలో, జాతీయ రహదారి పక్కనే ఉన్న సాయిచక్ర కోల్డ్ స్టోరేజీలో 2018, మార్చి 25న రాత్రి గుర్తు తెలియని దుండగులు చొరబడ్డారు. వాచ్‌మన్ శంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులను కత్తులతో బెదిరించి, బంగారు నగలను దోచుకెళ్లారు. అదే రోజు ఉండవల్లి మండలం, అలంపూర్ చౌరస్తాలో ప్రకాశం జిల్లా నుంచి వలస వచ్చి తాపీ పని చేసుకుంటూ, అద్దె ఇంట్లో ఉంటూ జీవనం సాగిస్తున్న చిన్నవీరయ్య ఇంట్లో ప్రవేశించారు. వారిని బెదిరించి వీరయ్య కుమార్తె కాళ్ల పట్టీలు, మొబైల్ ఫోన్ తీసుకొని పారిపోయారు. బాధితుల పిర్యాదు మేరకు, రెండు పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల అధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దుండగు లు ఉపయోగించిన కారు నెంబర్ ప్లేట్ అధారంగా అది మహారాష్ట్రలోని నాందే డ్ జిల్లాకు చెందినదిగా గుర్తించారు. అక్కడ గస్తీ కాసి ఏ2 నిందితుడు భీమ నార్సింగ్ వాగ్మోర్ అలియాస్ భీమ, ఏ3 నిందితుడు దాండ్లబాబు అలియాస్ బాబుబాలాజీ గైక్వాడ్‌లను అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. వారికి 2019లో నాలుగు నెలలు జైలు శిక్ష, వంద రూపాయల జరిమాన విధిస్తూ న్యాయాధికారి తీర్పునిచ్చారు. మిగిలిన ఏ1 నిందితుడు మెత్కుర్ లకన్ పీరాజీ అలియాస్ లక్ష్మణ్, ఏ4 నిందితుడు వాయిదాలకు హాజరు కాకపోవడంతో నాన్ బెయిలబుల్ వారెంట్ ఇష్యూ అయ్యింది. వారిని అరెస్ట్ చేసి గురువారం అలంపూర్ కోర్టులో ప్రవేశపెట్టారు. వారికి ఒక సంవత్సరం, ఐదు నెలల ఆరు రోజులు, రూ.200 జరిమాన విధిస్తూ న్యాయాధికారి కవిత తీర్పునిచ్చారు.

50 లీటర్ల మద్యం పట్టివేత

అమరచింత, మే 9 : మండలంలోని కొంకనివానిపల్లి గ్రామంలో గురువారం రాత్రి 50 లీటర్ల మద్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని బెల్ట్ షాపు నిర్వాహకుడు విష్ణువర్ధన్ రెడ్డి స్వగృహంలో తనిఖీ చేయగా నాలుగు కాటన్‌లలో 50 లీటర్ల మద్యం దొరికింది. దీంతో పోలీసులు స్వాధీనపరుచుకొని మద్యాన్ని సీజ్ చేశారు. ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం నిల్వ ఉంచితే చర్యలు తప్పవని ఎస్‌ఐ సురేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కురుమూర్తి స్వామి హుండీ లెక్కింపు

చిన్నచింతకుంట, మే 9 : మండలంలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలోని శ్రీ కురుమూర్తి వేంకటేశ్వరస్వామి హుండీని గురువారం ఆలయ ప్రాంగణంలో ఆలయ ఈవో మదనేశ్వర్‌రెడ్డి, దేవాదాయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ సమక్షంలో లెక్కించారు. ఇందులో రూ.7,42,073 ఆలయానికి ఆదాయం సమకూరింది. ఈ హుండీ లెక్కింపులో వెంకటేశ్వర్‌రెడ్డి, భాస్కర్, దినేష్ స్వామి పాల్గొన్నారు.

రక్త పరీక్షల రిపోర్టులకు ఎదురుచూపు

» మొరాయిస్తున్న టీ హబ్ యంత్రాలు
» రెండు రోజులైనా అందని రిపోర్టులు
» జనరల్ ఆసుపత్రి ల్యాబ్‌లలో మిస్సవుతున్న శ్యాంపిళ్లు
» ఇబ్బందులు ఎదుర్కొంటున్న రోగులు



తెలంగాణ డయాగ్నోస్టిక్ హబ్



మొరాయిస్తున్న యంత్రాలు

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), మే 9 : ఏ రోగం వచ్చినా చికిత్స చేయాలంటే రక్తపరీక్షలు ముఖ్యం. కానీ, ఆ రక్త పరీక్షల రిపోర్టుల కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. రెండు రోజులైతే తప్పా రిపోర్టులు చేతికి అందకపోవడంతో చికిత్స కోసం వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇందుకు టీ హబ్‌లో యంత్రాలు తరచూ మొరాయిస్తుండడం ఒక కారణమైతే, జనరల్ ఆసుపత్రిలోని ల్యాబ్‌లలో టెక్నీషియన్ల నిర్లక్ష్యం మరో కారణంగా చెప్పవచ్చు. ఫలితంగా రోగులు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి ఏర్పడింది.

టీ హబ్‌లో మొరాయిస్తున్న యంత్రాలు

మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, కమ్యూనిటీ ఆసుపత్రులకు సంబంధించి రక్తపరీక్షల శ్యాంపిళ్లు టీ హబ్‌కు వస్తాయి. అక్కడి నుంచి యంత్రాల ద్వారా పరీక్షలు చేసి అన్ని పీహెచ్‌సీలకు ఆన్‌లైన్‌లో రిపోర్టులు పంపిస్తారు. దీంతో పాటు జనరల్ ఆసుపత్రిలోని శ్యాంపిళ్లు కూడా టీ హబ్‌కే వస్తాయి. శ్యాంపిళ్లకు సంబంధించిన రిపోర్టులు కూడా రోగి సెల్‌ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. ఇది టీహబ్ పనిచేసే వ్యవస్థ. ఆ వ్యవస్థకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. కొన్ని రోజులుగా టీ హబ్‌లోని యంత్రాలు మొరాయిస్తున్నాయి. వారం రోజుల నుంచి సిబిపి, థైరాయిడ్ వంటి పరీక్షలతో పాటు మరిన్ని పరీక్షలు జరగడం లేదు. యంత్రాలలో సాంకేతిక లోపాల కారణంగా అవి పని చేయకపోవడంతో పరీక్షలు చేయడం లేదు. దీంతో అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఆ టెస్టులను నిలిపివేశారు. ఫలితంగా రోగులకు కూడా వైద్య సేవలు నిలిచిపోయాయి.

ప్రతీ రోజు పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, జనరల్ ఆసుపత్రి నుంచి దాదాపు 500 నుంచి 700 వరకు రక్త పరీక్షల శ్యాంపిళ్లు టీ హబ్‌కు వస్తున్నాయి. ఆసుపత్రికి వచ్చిన రోగి ఉదయం శ్యాంపిల్ ఇచ్చిన తర్వాత రిపోర్టులు ఆ రోగి సెల్‌ఫోన్‌కు మెసేజ్ రూపంలో వస్తాయి. రెండు రోజులైనా రిపోర్టుల మెసేజ్ రావడం లేదు. ఆ రిపోర్టులు వస్తేనే రోగికి చికిత్స అందించేందుకు అవకాశం ఉంటుంది. సకాలంలో రిపోర్టులు రాకపోవడం వలన చికిత్స అందడానికి జాప్యం జరుగుతోంది. ఆ జాప్యం లోనే రోగి మరింత అనారోగ్యానికి గురికావలసి వస్తుంది. ఇదిలా ఉండగా కొన్నిసార్లు 24 గంటల్లో రిపోర్టులు వచ్చినప్పటికీ మరుసటి రోజు ఆ రిపోర్టులు డాక్టర్‌కు చూపించడానికి మళ్లీ రావాల్సిన పరిస్థితి ఉంది. దీంతో దూరప్రాంతాల నుంచి వచ్చే వారు ఇబ్బందులు పడుతున్నారు. రవాణా ఖర్చులు భారంగా అవుతున్నాయి.

జనరల్ ఆసుపత్రిలో సిబ్బంది నిర్లక్ష్యం

శ్యాంపిళ్లు తీసుకునేందుకు ల్యాబ్‌లకు వెళ్లిన రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. రక్త పరీక్షలకు సంబంధించి ఒకసారి రక్తం తీసుకున్న తర్వాత ఆ శ్యాంపిళ్లు సక్రమంగా భద్రపరచకపోవడంతో కొన్నిసార్లు అవి మిస్సవుతున్నాయి. తిరిగి రోగికి సంబంధించిన వారు రిపోర్టుల కోసం వెళ్లినప్పుడు శ్యాంపిల్ పోయిందని, మళ్లీ రక్తం తీసుకోవాలని చెబుతుండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

అంతేకాకుండా కొన్ని పరీక్షలకు సంబంధించి ఎంతమోతాదులో రక్తం తీసుకోవాలో కూడా ల్యాబ్ సిబ్బందికి తెలియడం లేదు. కొన్నిసార్లు తక్కువ రక్తం తీసుకోవడంతో యంత్రాల్లో పరీక్ష చేయడానికి ఆ రక్తం సరిపోక దాన్ని రిజెక్ట్ చేస్తున్నారు. ఫలితంగా రోగికి రిపోర్టులు అందడం లేదు. ఈ కారణాల వలన రోగికి సకాలంలో వైద్యం అందడం లేదు.

ఎండవేడిమి వల్ల యంత్రాలు మొరాయిస్తున్నాయి

టీ హబ్‌లోని యంత్రాలు ఎండమేడిమి వలన మొరాయిస్తున్న మాట వాస్తవమే. అందుకు సర్వీసు ఇంజనీర్లను పిలిపించి సరిచేశాం. ప్రస్తుతం అన్నీ పరీక్షలు అవుతున్నాయి. సీబీపీ యంత్రంలో కొంత సమస్య ఉంది. దాన్ని కూడా ఈ రెండు రోజుల్లో సరి చేస్తాం. రిపోర్టుల విషయంలో చాలా మందికి సెల్ ఫోన్‌కు మెసేజ్ వస్తున్నప్పటికీ కొంత అవగాహన లేకపోవడం వల్ల ఇబ్బందులు వస్తున్నాయి. రిపోర్టులు కూడా అదేరోజు వచ్చేటట్లు చూస్తాం. జనరల్ ఆసుపత్రిలో శ్యాంపిళ్ల నిర్లక్ష్యంపై ల్యాబ్ సిబ్బందిని పిలిపించి మాట్లాడి ఇకపై ఆ పొరపాట్లు జరగకుండా చూస్తాం.

- డాక్టర్ జీవన్, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్

ఉమామహేశ్వరుడిని దర్శించుకున్న కేంద్ర మంత్రి



కేంద్ర మంత్రిని శాలువాతో సత్కరిస్తున్న అర్చకులు

అచ్చంపేట, మే 9: ఉమామహేశ్వర క్షేత్రంలో గురువారం కేంద్ర సమాచార శాఖ, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి లోగనాథన్ మురుగన్ ఈశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ ఈవో శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ కందూరు సుధాకర్‌లు, అర్చకుడు వీరయ్య పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. పాపనాశిని గుండంలో పుణ్యస్నానాలు ఆచరించి ఈశ్వరునికి క్షీరాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, గణపతి అయ్యప్పస్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఆవరణంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. అర్చకులు వీరయ్య, నీలకంఠం, రాజశేఖర్, రవికుమార్‌లు ఆయనకు ఆలయ చరిత్ర వివరించారు. అనంతరం పట్టణంలో బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

రాష్ట్ర రహదారుల రూపు రేఖలు మారుతున్నాయని మంత్రి అన్నారు. ఆర్ఆర్ఆర్‌కు రూ 2500కోట్ల నిధులు కేంద్రప్రభుత్వం కేటాయించి పనులు చేస్తున్నారన్నారు. అలంపూర్ నుంచి అచ్చంపేట మీదుగా దేవరకొండ వరకు డబుల్ లైన్‌ల ప్రతిపాదనలు ఎంపీ రాములు పంపడం జరిగిందన్నారు. మరికొన్ని రోజుల్లో గద్వాల్ నుంచి మాచర్ల రైల్వేలైన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 11న వనపర్తికి కేంద్ర మంత్రి అమీషా వస్తున్నారని, పెద్ద ఎత్తున్న కార్యకర్తలు, అభిమానులు రావాలన్నారు. మంగ్యనాయక్, పార్లమెంట్ కన్వీనర్ రామకృష్ణారెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ రేణయ్య, జానకి, జిల్లా కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

మల్లురవికి మద్దతుగా ఇంటింటి ప్రచారం

చారకొండ, మే 9: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా గురువారం మండల కేంద్రంలో అచ్చంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుండె వెంకట్‌గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్, సీపీఐ జిల్లా నాయకుడు డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో కాంగ్రెస్, సీపీఐ నాయకులు నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి మల్లు రవికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపించి పార్లమెంట్‌కు పంపించాల్సిన అవసరం ఉందని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ జగన్‌మోహన్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ పానుగంటి అంజయ్య, మండల యూత్ ప్రెసిడెంట్ గణేష్‌గౌడ్, గజ్జె కొండల్‌గౌడ్, శంకర్‌గౌడ్, జేసీబీ వెంకటయ్యగౌడ్, కందికంటి శ్రీనయ్యగౌడ్, రవిగౌడ్, సత్తార్, నర్సింహచారి, సీపీఐ మండల కార్యదర్శి ఏసొరపు అశోక్‌గౌడ్ తదతరులు పాల్గొన్నారు.

● **జూపల్లిలో..**

కల్వకుర్తి నియోజికవర్గం చారకొండ మండల పరిధిలోని జూపల్లిలో డీసీసీ ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్యయాదవ్, జిల్లా నాయకుడు ముస్తఫముజ్జుబాయిల ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి గెలుపుకోసం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపిస్తే ఈప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఎలుక రాంచెంద్రి, సీరాజ్, మల్లయ్య, వెంకటయ్య, అక్రం, మల్లికార్జున్, నిరంజన్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే తండాల అభివృద్ధి

- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి




ఉపాధి కూలీలతో కలిసి పనిచేస్తున్న మాజీ ఎమ్మెల్యే జనార్దన్ రెడ్డి

బిజినేపల్లి, మే 9 : గిరిజన తండాల అభివృద్ధి బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే సాధ్యమయిందని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రకుంట తండా, నక్కల చెరువు తండా, ఊడుగుల గుంట తండా, బొరుసుగడ్డ తండా, పెద్దతాండ, వసురాం తండాల్లో గురువారం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీ గెలిపించాలని విస్తృత్తంగా ప్రచారం చేసి మాట్లాడారు. పదేళ్లలో మాజీ సీఎం కేసీఆర్ గిరిజన తండాలను గ్రామ పంచాయతీలు మార్చి పారిపాలన వికేంద్రీకరణ ద్వారా అభివృద్ధిని పరుగులు పెట్టించారని అన్నారు. వికలాంగులకు, వితంతువులకు, వృద్ధులకు పింఛన్ రూ.2 వేలు అందించి గౌరవంగా జీవించేలా చేశాడని గుర్తు చేశారు. రైతులకు రైతు బంధు, రైతుబీమా, రుణమాఫీ చేసి బీఆర్ఎస్ ప్రభుత్వం అంటే రైతు ప్రభుత్వం అనే చందంగా వ్యవహరించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఎన్నికల ముందు ఆరు గ్యారంటీల పేరుతో 420 పథకాలు ప్రకటించి ఇప్పటి వరకు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజలు కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి మోసపోకుండా బీఆర్ఎస్ కారు గుర్తుపై ఓటు వేసి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించాలని కోరారు. ఆయన వెంట ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ శేఖర్ రెడ్డి, పులేందర్ రెడ్డి, వంశీ నాయక్, భారతి, మంగ్లీ, భోజ్యానాయక్, గోపీనాయక్, లింబ్యానాయక్, లక్ష్మి తదితరులు ఉన్నారు.

ఘనంగా షిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

పెంట్లవెల్లి, మే 9 : మండల కేంద్రంలో కొల్లాపూర్ వెళ్లే దారిలో వెలసిన సద్గురు షిరిడీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 5గంటలకు సాయినాథునికి సుప్రభాత సేవ, 7గంటలకు గణపతి పూజ, 10:30గంటలకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం, 12గంటలకు సాయినాథునికి మహామంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ, ఒంటిగంటకు అన్నప్రసాదం, సాయంత్రం 5:30గంటలకు కుంకుమార్చన, అదేవిధంగా రాత్రి 7:30గంటలకు సాయి పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా సచ్చిదానంద సద్గురు షిరిడి సాయి ట్రస్టు సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

బీజేపీ గెలిస్తే శక్తివంతమైన దేశంగా భారత్



సమావేశంలో మాట్లాడుతున్న భరత్‌ప్రసాద్

కందనూలు, మే 9: ఈ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా బీజేపీ 400 సీట్లు గెలిస్తే ప్రపంచంలో భారత్ శక్తివంతమైన దేశంగా మోదీ నిలబెడతారని నాగర్‌కర్నూల్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్ ప్రసాద్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని నెల్లికొండ వద్ద బీజేపీ పార్లమెంటు ఎన్నికల కార్యాలయంలో బీజేపీ అభ్యర్థి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా మోదీ హవాతో రాష్ట్రంలో బీజేపీకి వస్తున్న ఆదరణ చూసి కాంగ్రెస్ శ్రేణులు ఓర్వలేకపోతున్నారన్నారు. బీజేపీ నాగర్‌కర్నూల్ పార్లమెంటు ఎన్నికల బీజేపీ చీఫ్ ఏజెంట్ జక్కా రఘునందన్‌రెడ్డి, నాయకులు కట్టా సుధాకర్, జెట్టి వెంకటేష్, పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

పెద్దకొత్తపల్లి, మే 9 : జరగబోయే ఎన్నికల్లో బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు జలాల శివుడు దీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం మండల పరిధిలోని పెద్దకార్పాముల గ్రామంలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతీ ఒక్కరు హస్తం గుర్తుపై ఓటు వేసి బీజేపీ ఎంపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. బీజేపీ మండల అధ్యక్షుడు పదిర భీమేష్‌రెడ్డి, నాయకులు శివ, సాతాని శ్రీను, ఎం.కృష్ణ, ఎం.రాజు, విష్ణు, మహేష్, శంకర్, ఆంజనేయులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

● బిజినేపల్లి: నాగర్‌కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గ ఎంపీగా పోతుగంటి భరత్ ప్రసాద్‌ను ఎంపీగా గెలిపించాలని బీజేపీ నాయకులు శుక్రవారం మహదేవునిపేట, లట్టుపల్లి, ఖానాపూర్, పాలెం, బిజినేపల్లి తదితర గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ సభ్యుడు నారాయణాచారి, ఎద్దుల నరేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు భూషయ్య, శ్రీకాంత్, లక్ష్మినారాయణ, నరసింహ, శేఖర్, కపిలవాయి శేఖర్ తదితరులు ఉన్నారు.

వంద శాతం పోలింగ్ నమోదు కావాలి

- కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, మే 9 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగం మనకు కల్పించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకుని జిల్లా వ్యాప్తంగా వంద శాతం పోలింగ్ నమోదయ్యేలా చూడాలని జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటర్లందరూ నిస్పక్షపాతంగా, స్వచ్ఛందంగా ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత కీలకమని 18సంవత్సరాలు నిండి కొత్తగా ఓటు హక్కు పొందిన ఓటర్లందరూ పోలింగ్ రోజు ఎక్కడికి వెళ్లకుండా బాధ్యతగా తమ ఓటు హక్కును వినియోగించుకుని సత్తా చాటాలన్నారు. నూతన యువ ఓటర్లు ప్రజాస్వామ్యానికి పునాది అని ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో పాల్గొని తొలి ఓటు అనుభూతిని పొందాలన్నారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఫోటోతో ఉన్న ఓటరు కార్డు లేదా ఎన్నికల సంఘం నిర్దేశించిన గుర్తింపు కార్డులో ఏదైనా ఒకదాన్ని పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లాలని ఆయన అన్నారు.

● **ప్రచార, ప్రకటనలు ప్రచురించకూడదు**

మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ అనుమతి లేకుండా ఎన్నికల ప్రచార ప్రకటనలు ప్రచురించకూడదని జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ఉదయ్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న జీ-01లో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ద్వారా ముందస్తు అనుమతి తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ అనుమతి లేకుండా పోలింగ్ రోజున, అలాగే పోలింగ్‌కు ఒక రోజు ముందు ఈ నెల 12, 13వ తేదీల్లో ప్రింట్ మీడియాలో ఎలాంటి ఎన్నికల ప్రచార ప్రకటనలను ప్రచురించకూడదని కలెక్టర్ తెలిపారు. వివిధ రాజకీయ పక్షాలు, అభ్యర్థులు, ఇతరులు ఎవరైనా సరే ముందస్తుగా ఎంసీఎంసీ ద్వారా అనుమతి కోసం దరఖాస్తు చేసుకుని ధ్రువీకరణ పొందాలని తెలిపారు. లేనిపక్షంలో ఎన్నికల కమిషన్ రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం తనకున్న అధికారాలను వినియోగిస్తూ తగు చర్యలు చేపట్టేందుకు అవకాశం ఉందన్నారు. ఎన్నికల ప్రచార ప్రకటనలు చేయదలచిన వారు తప్పనిసరిగా ఎంసీఎంసీ ద్వారా ముందస్తు అనుమతి తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే రీతిలో ఆవేశపూరితమైన తప్పుదోవ పట్టించే ద్వేషపూరిత ప్రకటనలకు ఎట్టి పరిస్థితుల్లోను అనుమతి ఇవ్వబడదని స్పష్టం చేశారు.

● **నియమావళిని పాటించాలి**

నాగర్‌కర్నూల్ ఎంపీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రతీ ఒక్కరు కచ్చితంగా పాటించాలని జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా వివిధ రాజకీయ పార్టీలు తాము చేస్తున్న బహిరంగ సభలు, ఎస్ఎంఎస్, ప్రచారాలను ఎన్నికల నిబంధనల ప్రకారం 48గంటల వ్యవధిలో ఎలాంటి అభ్యంతకరమైన, రాజకీయపరమైన అంశాలతో కూడిన సంక్షిప్త సందేశాలు, బల్క్ ఎస్ఎంఎస్‌లపై ఎన్నికల సంఘం నిషేధం విధించిందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పోలింగ్‌కు ముందు 48గంటల సైలెన్స్ పీరియడ్‌లో ఎవరు కూడా రాజకీయపరమైన ఎస్ఎంఎస్‌లు, బల్క్ ఎస్ఎంఎస్‌లను పంపకూడదన్నారు. ఎస్ఎంఎస్‌ల ను పంపడానికి అయ్యే ఖర్చు లను కూడా పరిగణనలో కి తీసుకోనున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు.

మల్లు రవికే కల్లుగీత కార్మికుల మద్దతు

- రాష్ట్ర కల్లుగీత సహకార సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలరాజుగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కల్లుగీత సహకార సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలరాజుగౌడ్

నాగర్‌కర్నూల్ టౌన్, మే 9: నాగర్‌కర్నూల్ పార్లమెంటు పరిధిలోని గౌడ కులస్తులంతా ఏకమై కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవికి మద్దతు ఇచ్చి, భారీ మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర కల్లుగీత సహకార సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలరాజుగౌడ్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్‌తోనే గౌడ సామాజిక వర్గం కల్లుగీత కార్మికుల సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఆయన అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి నివాసంలో కల్లుగీత సహకార సంఘాల సమన్వయ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలరాజుగౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో గత ప్రభుత్వాల హయాంలో గౌడ సామాజిక వర్గానికి ఆశించిన స్థాయిలో సంక్షేమ ఫలాలు అందలేదన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గౌడ సామాజిక వర్గం కల్లుగీత కార్మికులకు అండగా ఉంటామని హామీ ఇచ్చిందన్నారు. గౌడ కులస్తులకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్ కల్పించడంతో పాటు అర్హులైన ప్రతీ కల్లుగీత కార్మికుడికి పెన్షన్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తోందని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా బీసీ కుల గణన చేసి గౌడ జనాభా ప్రకారం విద్య ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో గౌడ కులస్తులకు సమాన అవకాశం కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారన్నారు. గౌడ కుల కల్లుగీత సహకార సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతోందన్నారు. గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్యే వంగా మోహన్‌గౌడ్, రాష్ట్ర కన్వీనర్ వెంకన్నగౌడ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంగా పకీరయ్యగౌడ్, పట్టణ అధ్యక్షుడు నాగరాజుగౌడ్, ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యంగౌడ్, సహాయ కార్యదర్శి భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



ఊర్కొండలో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్ లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనంపల్లి అనురుధ్ రెడ్డి

ఊర్కొండ, మే 9 : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డితో కలిసి కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి జరుగుతుందని, గత పది సంవత్సరాలుగా రాష్ట్రంలో ఉన్న బీఆర్ఎస్ కేంద్రంలో ఉన్న బీజేపీ ఏమాత్రం పట్టించుకోకపోవడంతో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో వచ్చిన వెంటనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చి గ్రామీణ రోడ్లకు మహర్దశ కల్పించిందని తెలిపారు. ప్రధానంగా ఎంపీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసే బాధ్యతతో పాటు ఆరు గ్యారెంటీలను అమలు చేసే బాధ్యత తమపై ఉందని తెలిపారు. అదేవిధంగా గత ప్రభుత్వ హయాంలో భూ కబ్జాలకు పాల్పడిన అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో కరెంటు బిల్లులు ఎవరు చెల్లించవద్దని ఎన్నికల అనంతరం ప్రభుత్వమే చెల్లిస్తుందని ప్రజలకు తెలియజేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి మాట్లాడుతూ తనను గెలిపిస్తే ఈ ప్రాంత అభివృద్ధి జరుగుతుందని, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ప్రాంత బిడ్డ ఈ మండలం నుంచే రాజకీయ అరంగేట్రం చేసి నేడు ఉన్నత పదవిలో ఉన్నారని వారికి తోడు నీడగా తను ఉంటూ ఎమ్మెల్యేతో కలిసి అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మండల పార్టీ అధ్యక్షులు వెంకటయ్య గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ సర్పంచ్ ద్యాప నిఖిల్ రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనా రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి మన్నే జీవన్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్, అధికార ప్రతినిధి వీరస్వామి, మైనారిటీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సమి, నాయకులు శ్యామ్ సుందర్ రెడ్డి, పర్వత రెడ్డి, అనిల్ రెడ్డి, నర్సిరెడ్డి, మల్లేష్, అరిఫ్, అయూబ్ పాషా, రజిత, కంఠం విజయుడు, గోపినాయక్ మనోహర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

భారత పరిరక్షణ కోసం ఇండియా కూటమి గెలవాలి

అచ్చంపేటటౌన్, మే 9: భారత పరిరక్షణ కోసం ఇండియా కూటమి గెలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. గురువారం తన నివాసం లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాజీ మంత్రి రవీందర్ నాయక్‌తో కలిసి మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ రెండు బొమ్మ బొరుసు అని, 10 సంవత్సరాలు రెండు కలిసి రాష్ట్రంలో దేశంలో పాలించాయని, ఇప్పుడు అమాయక ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యాయన్నారు.

ఇక్కడ ఉన్న మాజీ ఎమ్మెల్యే మతి భ్రమించి మాట్లాడుతున్నారన్నారు. బీజేపీ మత రాజకీయాలు చేస్తోందని మాజీ మంత్రి రవీందర్ నాయక్ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మల్లురవిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. నాయకులు మోపతయ్య, రాజేందర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో భారీగా చేరికలు



వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన చిట్లంకుంటకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు

అమ్రాబాద్: పదర మండలం చిట్లంకుంట గ్రామం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సుమారు 100 మంది ఆ పార్టీకి రాజీనామా చేసి డీసీసీ అధ్యక్షుడు అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సమక్షంలో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ యూత్ నాయకులు మహేష్ ఆధ్వర్యంలో గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వీరందరూ కాంగ్రెస్‌లో చేరారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ అదేవిధంగా నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి గెలుపు కోసం ముమ్మరంగా పని చేయనున్నట్లు వారు ప్రకటించారు. కాంగ్రెస్ రాష్ట్ర జిల్లా నాయకులు డాక్టర్ మోపతయ్య, కొయ్యల శ్రీనివాసులు, మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మల్లు రవికి మద్దతుగా ఎమ్మెల్సీ ప్రచారం



వసంతాపూర్‌లో ఉపాధి కూలీలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

బిజినేపల్లి, మే 9 : నాగర్‌కర్నూల్ పార్లమెంటు నియోజవర్గ ఎంపీగా మల్లు రవిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్ రెడ్డి ఉపాధీ కూలీలను కోరారు. మండలంలోని వసంతాపూర్‌లో గురువారం మిత్రపక్షం సీపీఐ నాయకులతో కలిసి సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి మల్లు రవికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. సీనియర్ నాయకుడు మల్లు రవి నాగర్‌కర్నూల్ ఎంపీగా గెలిస్తే ఢిల్లీ నుంచి రావల్సిన నిధులను సకాలంలో తీసుకొచ్చి ఈప్రాంత అభివృద్ధి శరవేగంగా సాగేందుకు కృషి చేస్తాడని అన్నారు. మరోసారి చేయి గుర్తుకు ఓట్లు వేసి మల్లు రవిని గెలిపించి పార్లమెంటు పంపాలని కోరారు. సీపీఐ కార్యదర్శి పి.కృష్ణాజీ తదితరులు ఉన్నారు.

‘కాంగ్రెస్ ప్రభుత్వంతోనే బడుగు బలహీనవర్గాలకు పెద్దపీట’

తిమ్మాజిపేట: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే బడుగు బలహీన వర్గాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవికి మద్దతుగా మండల పరిధిలోని మారేపల్లి గ్రామంలో గురువారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ రెండుసార్లు ఎంపీగా గెలిచి అనుభవం ఉన్న వ్యక్తి డాక్టర్ మల్లురవి అని ఆయన గెలుపు కోసం ప్రజలు ఓట్లు వేయాలని ఆయన కోరారు. రాష్ట్ర నాయకులు శ్రీనివాస్‌బహదూర్, జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దానం బాలరాజు, మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మాధవులు, సీనియర్ నాయకులు ఉస్మాన్‌రవూఫ్, లక్ష్మీనారాయణ, దేవస్వామి, లింగం, నాగసాయిలు, వరుణ్, ఆనంద్‌చారి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

పెద్దకొత్తపల్లి, మే 9 : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గానికి జరగనున్న ఎన్నికల్లో ప్రతీ ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏపీడీ చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండల పరిధిలోని గంట్రావుపల్లి గ్రామంలో ఉపాధి కూలీలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

‘ప్రతీ ఒక్కరు కలిసికట్టుగా కృషి చేయాలి’

పెంట్లవెల్లి, మే 9 : కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం ప్రతీ ఒక్కరు కలిసికట్టుగా కృషి చేయాలని కాంగ్రెస్ మండల నాయకులు ఎర్రశ్రీను అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఉపాధి కూలీలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. అదేవిధంగా జటప్రోల్‌లో కాంగ్రెస్ గ్రామ నాయకుడు మో తుక్కారి నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మంచాలకట్టలో గొల్ల రము ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. కాంగ్రెస్ నాయకులు రవి, కుమార్, భీంరెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

తాడూరు, మే 9 : మండలంలోని సిర్సవాడ గ్రామంలో ఈ నెల 20వ తేదీ నుంచి 24వ తేదీ జరగబోతున్న శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు, జాతర కార్యక్రమాలకు సంబంధించి గురువారం ఆలయ ప్రాంగణంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ రానున్న పది రోజుల్లో శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు, జాతర ఘనంగా నిర్వహించనున్న నేపథ్యంలో ఇప్పటికే ఏర్పాట్లను చేపడుతున్నట్లు తెలిపారు. లక్ష్మీనరసింహుని కల్యాణం ఈ నెల 22న అంగరంగ వైభవంగా చేపట్టనున్నట్లు తెలిపారు.

‘రాహుల్‌గాంధీ ప్రధాని అయితే బీసీలకు న్యాయం’

నాగర్‌కర్నూల్ టౌన్, మే 9: ప్రస్తుత పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించి రాహుల్‌గాంధీ ప్రధాని అయితే బీసీలకు సామాజిక న్యాయం జరుగుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కాళ్ల నిరంజన్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాళ్ల నిరంజన్ మాట్లాడుతూ దేశంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పదేళ్ల పాటు అధికారంలో ఉండి బీసీలకు ఒరగబెట్టింది ఏమి లేదని విమర్శించారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీ కుల గణన చేపట్టి విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు చట్ట సభల్లో ప్రాధాన్యత కల్పిస్తామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. బీసీ ప్రజలంతా ఏకమై మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ పార్లమెంటు అభ్యర్థులు వంశీచంద్‌రెడ్డి, మల్లు రవిలను భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్, నాయకులు కొత్త శ్రీనివాసులు, తిరుపతయ్య, సుధాకర్‌గౌడ్, పబ్బతి శ్రీనివాసులు, చెన్నయ్య, కృష్ణయ్య, నిరంజన్, నిరంజన్‌యాదవ్, కుర్మయ్య పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కూలీలకు విజ్ఞప్తి

కోడేరు, మే 9 : పార్లమెంట్ మెంబర్‌గా బీజేపీ అభ్యర్థి పోతుగంటి భరత్‌ప్రసాద్ కమలం గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు, జిల్లా కార్యదర్శి రవీందర్‌రావులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఉపాధి హామీ కూలీలతో కలిసి బీజేపీ కమలం గుర్తుపై ఓటు వేసి నరేంద్ర మోదీని మూడోసారి ప్రధానిగా చేయాలని కూలీలను అభ్యర్థించారు. బీజేపీ పార్టీ సీనియర్ నాయకులు లింగంగౌడ్, మండల అధ్యక్ష కార్యదర్శులు పుల్లయ్య, బాలపీరు, ఓబీసీ అధ్యక్షుడు రామకృష్ణ, బూత్‌లెవల్ నాయకులు నజీర్, నాగరాజు, మౌలాలి, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పనితీరు నచ్చి కాంగ్రెస్‌లో చేరికలు

మన్ననూర్, మే 9: రాష్ట్ర ప్రభుత్వ పనితీరు నచ్చడంతో పార్లమెంటు ఎన్నికల వేళ పలు పార్టీలకు చెందిన నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారు. అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో గురువారం ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి తరఫున కాంగ్రెస్ నాయకులు గడప గడపకు తిరిగి ఓట్లను అభ్యర్థిస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ సయ్యద్‌తో పాటుగా పలువురు విద్యార్థి సంఘం నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఎంపీటీసీ దాసరి శ్రీనివాసులు, డీసీసీ కార్యదర్శి సంబు వెంకట్‌రమణ, కోఆప్షన్ సభ్యుడు రహీం, మాజీ వైస్ ఎంపీపీ సంబు శోభ, కాంగ్రెస్ నేతలు జూలూరి సత్యనారాయణ, తుల్యా, రమణగౌడ్ పాల్గొన్నారు.

తేమ శాతం చూసి వడ్లు కొనుగోలు చేయాలి



కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్

తెలకపల్లి, మే 9 : మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వడ్ల కొనుగోలు కేంద్రాలను గురువారం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటేశ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వడ్లను మాయిచ్చర్ మీటర్‌తో తేమ శాతాన్ని చూశారు. తేమ 14శాతం ఉంటేనే కొనుగోలు చేయాలని సంబంధిత ఇన్‌చార్జ్‌లకు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోనే సంచులు బయటకు ఇవ్వకూడదని, కొనుగోలు సెంటర్‌కు వచ్చిన రైతులకు మాత్రమే ఇవ్వాలన్నారు. వడ్లకు మొదటి రకం 2203రూపాయలు, సాధారణ గ్రేడ్ వరికి క్వింటాల్‌కు 2183రూపాయల మద్దతు ధరను చెల్లించి మిల్లులకు పంపించాలన్నారు. రైతులు పండించిన పంటను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకోవాలని మధ్య దళారులకు విక్రయించి మోసపోకూడదన్నారు. ఏపీఎం నిరంజన్, ఏఈవో రాధిక, కమిటీ సభ్యులు స్వాతి, సీసీలు నరసింహ, సుకునయ్య, వీవోఏలు, ఫర్హాత్‌బేగం, మహేశ్వరి, ఆంజనేయులు, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

‘సంక్షేమ ఫలాలు అందేలా చూస్తాం’

కల్వకుర్తి, మే 9 : కాంగ్రెస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించి మల్లు రవిని భారీ మెజార్టీతో గెలిపించాలని కల్వకుర్తి మాజీ జడ్పీటీసీ సభ్యుడు అశోక్‌రెడ్డి కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డిల సహకారంతో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని తెలిపారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవికి మద్దతుగా కల్వకుర్తి మండలం లింగసానిపల్లి, పంజుగుల గ్రామాల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డితో కలిసి అశోక్‌రెడ్డి పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. కాంగ్రెస్ నాయకులు మధుసూదన్‌రెడ్డి, ఎండి.అజీమ్, వెంకట్‌రెడ్డి, రాజుగౌడ్, రమేష్, పరుశరాములు, అర్జున్, వెంకటయ్య, రాజల్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బీరం రోడ్‌షో

కొల్లాపూర్, మే 9 : నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ గురువారం సాయంత్రం కొల్లాపూర్ పట్టణంలోని ప్రధాన రహదారుల గుండా మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి కార్యకర్తలతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వ్యాపారులను ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని వ్యాపారులను కోరారు.

‘యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు’

అమ్రాబాద్, మే 9: కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడడం ద్వారానే నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని నాగర్ కర్నూల్ డీసీసీ కార్యదర్శి మద్దెల దివాకర్ అన్నారు. గురువారం అమ్రాబాద్ మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా కేంద్రంలో అధికారం వెలగబెట్టిన బీజేపీ ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. 2014 ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన యువతకు ఒక సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించే విషయంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ప్రస్తుత ఎన్నికల్లో దేశవ్యాప్తంగా నరేంద్ర మోదీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడానికి దేశ ప్రజలు సిద్ధంగా ఉన్నారని దివాకర్ అన్నారు. నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంతో మూడున్నర దశాబ్దాలకు పైగా రాజకీయ అనుబంధం ఉన్న ప్రస్తుత కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి పిలిస్తే పలికే మల్లుగా గుర్తింపు పొందారని అన్నారు. ఆయన గెలుపు కోసం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ముమ్మరంగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే అచ్చంపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో సమిష్టిగా కృషి చేసి అత్యధికంగా మెజార్టీ వచ్చేలా పని చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

యన్మనబెట్లలో బీఆర్ఎస్ ప్రచారం

కొల్లాపూర్, మే 9 : కొల్లాపూర్ మండల పరిధిలోని యన్మన్‌బెట్ల గ్రామంలో పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలని ఎంపీపీ రజిత బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సీనియర్ నాయకులు సురేందర్‌రావు, బెవిని ధర్మయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు కుర్మయ్య, వార్డు మెంబర్లు అనుకలి కృష్ణయ్య, మంచాల కుర్మయ్య, కోళ్ల సాయికుమార్, బీఆర్ఎస్ కార్యకర్తలు కోళ్ల రాముడు, కోళ్ల బాలస్వామి, మంచాల ఉపేందర్, బజారు గాలేన్న, మరాఠి సత్యనారాయణ, యాదవ సంఘం మాజీ అధ్యక్షుడు పాశం రామకృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

‘రైతులకు ద్రోహం చేసిన బీజేపీని ఓడించాలి’

కోడేరు, మే 9 : భారతదేశ రైతాంగానికి ద్రోహం చేసిన బీజేపీని ఓడించాలని సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ ఎం.శ్రీనివాసులు అన్నారు. గురువారం కోడేరు మండల కేంద్రంలో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో పలు పార్టీల నాయకులతోరౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు చలపతిరావు, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు ఆర్.జగదీశ్వర్‌రావు, కాంగ్రెస్ కిసాన్ సెల్ నాయకులు నాగేశయ్య, ఎస్ఎఫ్ఐ నాయకులు మిద్దె కార్తీక్, కాంగ్రెస్ నాయకులు మిద్దె రామకృష్ణ, చామంతిరాజు, సొప్పరి తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో మొక్కలదే ముఖ్య పాత్ర

బిజినేపల్లి, మే 9 : పర్యావరణ పరిరక్షణలో మొక్కలదే ముఖ్యపాత్ర అని సస్యరక్షణ అధికారి సునీత అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం ఖానాపూర్ గ్రామంలో గురువారం అంతర్జాతీయ మొక్కల ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని సమగ్ర సస్యరక్షణ కేంద్రం, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో మొక్కల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించి ఆమె మాట్లాడారు. జీవ నియంత్రణ పద్ధతులు పాటిస్తూ పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అంతకు ముందు గ్రామస్థులతో కలిసి గ్రామ పురవీధుల గుండా రైతువేదిక వరకు ర్యాలీ నిర్వహించారు. కేవీకే శాస్త్రవేత్త బి.రాజశేఖర్, ఏఈవో శారద, రవిశంకర్, రైతులు శ్రీనివాస్ రెడ్డి, ఆంజనేయులు, విజయభాస్కర్ రెడ్డి, లచ్చగౌడ్, సుధాకర్, వెంకట్ రెడ్డి, మల్లికార్జున్, చంద్రయ్య, చాకలి బాషా తదితరులు ఉన్నారు.

‘గ్యారెంటీల పేరుతో మోసం’

ఊర్కొండ, మే 9: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరుతో మోసం చేశారని జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే డా.సి.లక్ష్మారెడ్డి విమర్శించారు. గురువారం మండలంలోని ఊర్కొండపేట, మాదారం గ్రామాల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జడ్పీ వైస్‌పర్సన్ శాంతకుమారి, ఎంపీటీసీలు కలించర్ల గోపాల్‌గుప్త, ఈశ్వరమ్మ, మండల కో ఆప్షన్ మెంబరు కలీంపాష, మాజీ సర్పంచ్ కృష్ణగౌడ్, బీఆర్ఎస్ నాయకులు వీరారెడ్డి, గిరినాయక్, జంగయ్య, తిరుపతిరెడ్డి, శేఖర్, వెంకటేష్, అక్బర్, కొండగిరి ఉన్నారు.